నేడు జిల్లాకు ఎస్‌సి కమిషన్ చైర్మన్ రాక

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర షెడ్యూల్ కులాల కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ బుధవారం జిల్లాలో పర్యటించనున్నట్టు డిఆర్‌ఒ గణపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ఆర్‌అండ్‌బి అతిథి గృహానికి చేరుకుంటారని పేర్కొన్నారు. అక్కడ మీడియా ప్రతినిధులతో మాట్లాడి అనంతరం బయలుదేరి మచిలీపట్నం వెళ్తారని తెలిపారు.

ఖరీఫ్‌కు సిద్ధమయ్యేనా?

- అసంపూర్తిగా వంశధార స్టేజ్-2, ఫేజ్-2 పనులు
- ఒప్పంద కాలపరిమితి జూన్ వరకు పొడిగింపు
- పెండింగ్‌లో భూసేకరణ
- ఖరీఫ్ సాగునీరు విడుదలపై నెలకొన్న సందేహాలు

వంశధార ప్రాజెక్టును జూన్ నాటికి పూర్తి చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఖరీఫ్‌కు సాగునీళ్లపై అనేక సందేహాలు నెలకొన్నాయి. గతేడాది డిసెంబరు 31 నాటికి పూర్తి కావాల్సి ఉంది. పనులు మరో పది శాతం పెండింగ్‌లో ఉండటంతో ఈ ఏడాది జూన్ వరకు పొడించారు. వర్షాకాలం, తుపాన్లు వంటి ఆటంకాలు ఇప్పుడు లేకపోవడంతో పనులు చేపట్టేందుకు అనువుగా ఉంది. ప్రాజెక్టు కొన్నిచోట్ల భూమిని సేకరించినా రైతులకు డబ్బులు చెల్లించలేదు. దీంతో కాలువ తవ్వకాల పనులు ముందుకు సాగడం లేదు. వంశధార పనులు చేపడుతున్న నిర్మాణ సంస్థలకు బిల్లుల బకాయిలు ఉండటంతో పనుల పూర్తి చేయడంపై పెద్దగా ఆసక్తి చూపడం లేదన్న విమర్శలూ వినిపిస్తున్నాయి. వంశధార స్టేజ్-2, ఫేజ్-2 ను పూర్తి చేసి ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం భావించినా అవి నెరవేరేటట్లు కనిపించడం లేదు.

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

వంశధార ఫేజ్-2, స్టేజ్-2 ప్రాజెక్టు పనులకు రూ.933.90 కోట్లతో 2005లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించింది. ప్రాజెక్టు పనులను 87,88 ప్యాకేజీలు, హిరమండలం రిజర్వాయరు పనులుగా విభజించారు. 87 ప్యాకేజీ పనులను హర్విన్ కనస్ట్రక్షన్స్ ప్రయివేట్ లిమిటెడ్‌కు, 88 ప్యాకేజీ పనులను శ్రీనివాస కనస్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్‌కు, హిరమండలం రిజర్వాయరు పనులను సోమ-పటేల్ కంపెనీకి అప్పటి ప్రభుత్వం అప్పగించింది. 2008 జూలై నాటికి 87 ప్యాకేజీ పనులు 31 శాతం, 88 ప్యాకేజీ పనులు 36 శాతం పూర్తయ్యాయి. హిరమండలం రిజర్వాయరు పనులు 60 శాతం మేర పూర్తయ్యాయి. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం ప్రాజెక్టు పనుల అంచనాలను రూ.1616.23 పెంచింది. 2019 వరకు 87 ప్యాకేజీ పనులు 64 శాతం, 88 ప్యాకేజీ పనులు 81 శాతం, హిరమండలం రిజర్వాయరు పనులు 87 శాతం పూర్తయ్యాయి. ఇప్పటివరకు రూ.1650.20 కోట్లను ఖర్చు చేశారు.

మందకొడిగా ప్రాజెక్టు పనులు

వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత మరోమారు ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని 2,671.52 కోట్లకు పెంచారు. రెండున్నరేళ్ల కాలంలో నిర్మాణ పనుల్లో పెద్దగా పురోగతి కనిపించడం లేదు. వీటిలో 87 ప్యాకేజీ పనులు 90 శాతం పూర్తయ్యాయి. అంచనా వ్యయం రూ.173.41 కోట్లు కాగా, ఇప్పటివరకు రూ.124.87 కోట్లు ఖర్చు చేశారు. లైనింగ్ పనులకు సంబంధించి ఇప్పటివరకు 7.63 కి.మీ. పూర్తి కాగా మరో 3.83 కిమీ మేర లైనింగ్ పనులు పురోగతిలో ఉన్నాయి. అండర్ పాసేజ్‌లు, వంతెనలు తదితర నిర్మాణాలు 25 వరకు నిర్మించాల్సి ఉండగా, ఇప్పటివరకు 24 నిర్మించారు. ఒప్పంద కాలపరిమితిని ఈ ఏడాది డిసెంబరు 31 వరకు పొడిగించారు. 88 ప్యాకేజీ పనులు 94 శాతం పూర్తయ్యాయి. అంచనా వ్యయం రూ.192.66 కోట్లు కాగా ఇప్పటివరకు రూ.156.83 కోట్లు ఖర్చు చేశారు. లైనింగ్ పనులకు సంబంధించి ఇప్పటివరకు 16.6 కి.మీ. పూర్తి కాగా, మరో 1.19 కి.మీ. మేర లైనింగ్ పనులు పురోగతిలో ఉన్నాయి. అండర్ పాసేజ్‌లు, వంతెనలు తదితర నిర్మాణాలు 37 వరకు నిర్మించాల్సి ఉండగా, ఇప్పటివరకు 36 నిర్మించారు. ప్యాకేజీ పనులు 28, అక్టోబరు 2017 నాటికి పూర్తి కావాల్సి ఉంది. వివిధ కారణాలతో పనులు సకాలంలో జరగకపోవడంతో ఆరు నెలలకొకసారి పొడిగించారు. పనులు పూర్తి చేసేందుకు చివరి సారిగా ఈ ఏడాది డిసెంబరు 31 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు.

అసంపూర్తిగా హిరమండలంలోని వంశధార రిజర్వాయరు పనులు

అసంపూర్తిగానే రిజర్వాయరు

హిరమండలం రిజర్వాయరు పనులు అంచనా వ్యయం రూ.419.03 కోట్లు కాగా, ఇప్పటివరకు రూ.376.31 కోట్లను వెచ్చించారు. మూడేళ్లలో పనుల్లో పెద్దగా పురోగతి కనిపించడం లేదు. వంశధార ప్రాజెక్టు పూర్తికి అనేక పర్యాయాలు ఒప్పంద కాలపరిమితిని పొడిగించినా ఏనాడు అనుకున్న సమయానికి పూర్తి కాలేదు. 2015లో జరిగిన ఒప్పందం ప్రకారం 28 అక్టోబరు 2017 నాటికి పూర్తి కావాలి. ఇప్పటివరకు 94.5 శాతం పనులు పూర్తయ్యాయి. 87 ప్యాకేజీ పనులు 90 శాతం, 88 ప్యాకేజీ పనులు 94 శాతం, హిరమండలం రిజర్వాయరు పనులు 94.50 శాతం పనులు జరిగాయి. ఇప్పటివరకు రూ.1987,53 కోట్లను ఖర్చుచేశారు. పనులు సకాలంలో పూర్తి కాకపోవడంతో అప్పటి నుంచి ఆరు మాసాలు చొప్పున పొడిగిస్తూ వచ్చారు. చివరి సారిగా ఈ డిసెంబరు 31 వరకు మరోసారి పొడిగించారు.

పెండింగ్‌లో భూసేకరణ

వంశధార ప్రాజెక్టుకు సంబంధించి మరో వైపు భూసేకరణ కూడా పెండింగ్‌లో ఉంది. 87 ప్యాకేజీ కింద చేపడుతున్న కాలువ తవ్వకాలకు 71.32 ఎకరాల భూమి అవసరం. అధికారులు ఇప్పటికే భూసేకరణ పూర్తి చేసినా సంబంధిత రైతులకు రూ.9.20 కోట్లు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం ఇప్పటివరకు నిధులు విడుదల చేయకపోడంతో కాలువ తవ్వకాలు ముందుకు సాగడం లేదు. అదేవిధంగా 88 ప్యాకేజీ కింద చేస్తున్న కాలువ పనులకు 20.16 ఎకరాలు కావాల్సి ఉంది. రైతులకు రూ.2.92 కోట్లు చెల్లించాల్సి ఉంది. పనులు మందకొడిగా సాగుతుండటం, భూసేకరణ పెండింగ్‌లో ఉండటంతో ఒప్పంద కాలపరిమితిని ఈ ఏడాది జూన్ వరకు పొడిగించారు. మరోసారి ఒప్పందం కాలపరిమితి పొడిగించాల్సిన పరిస్థితులు రావొచ్చనే అభిప్రాయాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు.

వచ్చే ఖరీఫ్‌కు నీళ్లిందించేలా చర్యలు

వంశధార ప్రాజెకు స్టేజ్-2, ఫేజ్-2 పనులను జూన్ నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రాజెక్టుకు అవసరమైన భూమికి ప్రభుత్వం డబ్బులు చెల్లించిన వెంటనే కాలువ తవ్వకాలు చేపడతాం. ప్రాజెక్టును వేగంగా పూర్తి చేసి ఖరీఫ్‌కు నీళ్ల అందించాలని అనుకుంటున్నాం.

- డోల తిరుమలరావు,
వంశధార ప్రాజెక్టు సర్కిల్ ఎస్ఇ

ఇంటింటా సంతకాల సేకరణ

పండగ పూట ఊరూరా అంగన్వాడీల నిరసన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నిరవధిక సమ్మెలో భాగంగా అంగన్వాడీలు సంక్రాంతి వేడుకలకు దూరంగా పోరాటాన్ని కొనసాగించారు. ఈ మేరకు మంగళవారం ఇంటింటికీ వెళ్లి తమ న్యాయ సమ్మతమైన పోరాటానికి మద్దతు నివ్వాలని కోరుతూ సంతకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. నిరవదిక సమ్మె చేయాల్సిన అవసరాన్ని వారు ప్రజలకు వివరించారు. నగరంలో ఉన్న అర్బన్ ప్రాజెక్టు పరిధిలో చేపట్టిన కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షులు కె.కళ్యాణి పాల్గొని మాట్లాడారు. నాలుగేళ్లుగా తమ సమస్యలను అనేక రకాలుగా ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో చట్టబద్ధంగా సమ్మె చేపట్టాల్సి వచ్చిందని వివరించారు. పెరిగిన ధరలకనుగుణంగా వేతనాలు పెంచకపోతే ఎలా బతకాలో మీరే చెప్పాలని ప్రజలను కోరారు. మరో వైపు న్యాయసమ్మతమైన కోర్కెలు పరిష్కరించమని సమ్మె చేస్తుంటే అంగన్వాడీల సమ్మెపై ఎస్మా ప్రయోగిస్తూ జిఒ ఇవ్వడం, నోటీసులు ఇస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని వివరించారు. తమ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని ప్రజలకు వివరించి వారి సంతకాలను సేకరించారు. అంగన్వాడీలు గత 35 రోజులుగా సమ్మె పోరాటం చేస్తున్నా ముఖ్యమంత్రి అంగన్వాడీలపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయుకులు పాల్గొన్నారు.

పొందూరు: అంగన్వాడీల సమ్మె సమంజసమైనదని, వారి న్యాయమైన కోర్కెలు వెంటనే పరిష్కరించాలని విశాఖపట్నం సిపిఎం నాయుకులు కూన వెంకటరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు అన్నారు. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్ల సాధనకు, వేతనాలు పెంపుదలకు అంగన్వాడీలు చేస్తున్న సమ్మెను బలపరుస్తూ జగనన్నకు చెబుతాం కోటి సంతకాలు సేకరణలో భాగంగా ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన మండలంలోని గోరింటలో లబ్ధిదారులు, ప్రజలతో ఇంటింటికీ వెళ్లి సంతకాలను సేకరించారు. అంగన్వాడీలు చేస్తున్న సమ్మెను బలపరుస్తున్నాని గోరింట సర్పంచ్ చింతాడ శ్రీలక్ష్మి తెలిపారు. అంగన్వాడీల సమ్మెపై ఎస్మా ప్రయోగిస్తూ జిఒ ఇవ్వడం, నోటీసులు ఇస్తూ బెదిరింపులకు పాల్పడటాన్ని తీవ్రంగా ఖండించారు. మాజీ సర్పంచ్ చింతాడ. కృష్ణవాసుదేవరావు, చింతాడ సింహాచలం, కూన వుడాయవార్లు, అడ్వకేట్ సిహెచ్.లక్ష్మణరావు తదితరులు మద్దతు తెలుపారు. కార్యక్రమంలో అంగన్వాడీలు సిహెచ్.కృష్ణవేణి, అమ్మయమ్మ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : సంతకాలను సేకరిస్తున్న అంగన్వాడీలు

కొత్తూరు : 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో భాగంగా కొత్తూరులో అంగన్వాడీలు సంతకాలను సేకరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు జలజాక్షి, ధనలక్ష్మి, అమ్మాయమ్మ, బోడమ్మ, అరుణ, మధురవేణి, రజని, లక్ష్మి పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : 'జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా టెక్కలిలో అంగన్వాడీలు సంతకాలను సేకరించారు. ముందుగా సమ్మె శిబిరం వద్ద నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు నంభూరు షణ్ముఖరావు, నందిగాం, టెక్కలి మండలాలకు చెందిన ఆయా పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

కొత్తూరు : సంతకాలను సేకరిస్తున్న అంగన్వాడీలు

పొందూరు : సంతకాలను సేకరిస్తున్న అంగన్వాడీలు

జాతర్లకు పోటెత్తిన ప్రజలు

నిలిచిన వాహనాలు

ఆమదాలవలస : మండలంలోని గాజుల కొల్లివలస పంచాయతీ పరిధిలోని సంగమేశ్వర స్వామి కొండ వద్ద జరుగుతున్న మూడు రోజుల జాతరలో భాగంగా యాత్రికులు అధిక సంఖ్యలో రావడంతో కిటకిటలాడింది. దీంతో అలికాం-బత్తిలి ప్రధాన రహదారి ట్రాఫిక్ జామ్‌తో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. కిలోమీటర్ల మేర బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలు ప్రధాన రహదారిపై ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రజలు పలు ఇబ్బందుల ను ఎదుర్కొన్నారు. పోలీసులు విధుల్లో భాగంగా ట్రాఫిక్‌ను నియంత్రించడానికి ప్రయత్నించినా... అదుపులోకి రాలేదు. ఆమదాలవలస నుంచి హిర మండలం వైపు వెళ్లే వాహనాలు కృష్ణాపురం నుంచి నిలిచిపోయాయి. అలాగే పాలకొండ రోడ్డు నుంచి వచ్చే వాహనాలు పార్వతీశంపేట రోడ్డుపైన పలు వాహనాలు నిలిచిపోయాయి. హిరమండలం వైపు నుంచి వచ్చే వాహనాలు జొన్నవలస నుంచి అలికాం బత్తిలి ప్రధాన రహదారిపై నిలిచిపోయాయి. మూడు ప్రధాన రహదారులపైన అధిక సంఖ్యలో గంటలు తరబడి వాహనాలు నిలిచిపోవడంతో యాత్రికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఏటా ఈ విధంగానే ట్రాఫిక్ ఎక్కడికి అక్కడ నిలిచిపోతుందని, ముందస్తు చర్యలు చేపట్టడంలో పోలీసులు విఫలం అవుతున్నారని పలువురు గుసగుసలాడుకున్నారు. అలాగే కలివరంలో వల్లభనరాయణ, వరహా లక్ష్మీనరసింహస్వామి ఆలయాల పరిధిలోని కోడోబల్ల యాత్ర నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన తొగరాం, ఇసకలపేట, కొత్తవలస, ముద్దాడపేట, పీరుసాహెబ్‌పేట, కంచరాపువానిపేట గ్రామాల నుంచి యాత్రకు తరలివచ్చారు.

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో హట్కో కాలనీ పరిధిలో డేకురుకొండ ఉత్సవం సంక్రాంతి సందర్భంగా ఘనంగా జరిగింది. డేకురు కొండ ప్రాంతంలో భీముడు పాదాలు ఉంటాయి. జారుడు బల్ల లాంటి రాళ్ల ఉండటంతో ఏటా నవ దంపతులు వాటిని దర్శించుకుంటారు. కనుమ రోజున నిర్వహించిన యాత్ర పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు తరలిరావడంతో ఆ ప్రాంతం కిక్కిరిసింది.

టెక్కలి రూరల్ : రద్దీగా ఉన్న మటన్ షాపు

కనుమవిందు

- భారీగా పెరిగిన మాంస విక్రయాలు
- పెరిగిన మద్యం అమ్మకాలు
- జిల్లాలో పలుచోట్ల జాతరలు
- రద్దీగా మారిన సినిమా థియేటర్లు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్, టెక్కలి రూరల్

సంక్రాంతి పర్వదినాల్లో చివరి రోజైన కనుమ పండగ జిల్లాలో భలే పసందుగా సాగింది. పల్లెల్లో గోసేవ నిర్వహించి ఆవులకు పొంగళి తినిపించడం ఈవేడుక ప్రత్యేకత. దీనికి తోడు మాంసాహార, మద్యం ప్రియులకు ఈ వేడకల్లో పట్టలేని ఆనందం. మంగళవారం కనుమ కావడంతో మాంసాహారులను ఆపటం ఎవరి తరం కాలేదు. అన్‌స్టాప్‌బుల్‌గా ఆరగించేశారు. సాయంత్రం సినిమా థియేటర్లు, ఎగ్జిబిషన్లు, ఆలయాలను సందర్శించి ఆహ్లాదంగా గడిపారు. జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల నిర్వహించిన యాత్రలకు పెద్దఎత్తున జనం హాజరై సందడి చేశారు. ఇతర ప్రాంతాల నుంచి సొంత ఊళ్లకు చేరిన వారంతా ఈవేడుకల్లో బాగస్వాములయ్యారు.

పండగల పసందు కనుమ విందుతో ముగిసింది. కనుమ, పైగా మంగళవారం కావడంతో మాంసం విక్రయాలు జోరుగా సాగాయి. జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాలన్న తేడా లేకుండా అన్నిచోట్లా మాంసాల కొనుగోళ్లతో ఆ దుకాణాలు రద్దీగా మారాయి. మాసం ధర గతేడాది, ఈ ఏడాది రూ.వెయ్యికే విక్రయించారు. కోడి మాంసం ధర కిలో రూ.170 నుంచి రూ.210కి పెంచి విక్రయించారు. చేపల ధరలూ సైజు బట్టి పెరిగాయి.

విందులో మందు

మద్యం ప్రియులు ఈ వేడుకల్లో ఆనందడోలికల్లో తేలియాడారు. చుక్క ముక్కతో తెగ ఆనందించారు. జిల్లాలో 192 మద్యం షాపులు, 23 బార్లు ఉన్నాయి. సాధారణ రోజుల్లో సుమారు రూ.3.50 కోట్ల వరకు మద్యం అమ్మకాలు జరుగుతాయి. ఈ ఏడాది డిసెంబరు 31న రూ.6.04 కోట్ల మద్యం విక్రయాలు సాగాయి. నెలకు రూ.80 కోట్ల నుంచి రూ.135 కోట్ల మేర మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. సంక్రాంతి పర్వదినాలైన ఈ మూడు రోజుల్లో సుమారు రూ.25 కోట్ల నుంచి రూ.30 కోట్ల వ్యాపారం సాగుతుందని అధికారులు అంచనా వేశారు. మద్యం అమ్మకాల్లో అత్యంత కీలకంగా కనుమ రోజును భావిస్తారు. అదేస్థాయిలో అమ్మకాలు సాగాయని అధికారులు చెబుతున్నారు. బుదవారం ముక్కనుమ కావడంతో మరింత విక్రయాలు పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. జనవరి 9 నుంచి ప్రభుత్వ పాఠశాలకు సెలవులు వచ్చాయి. ఈనెల 19న తిరిగి పాఠశాలలు తెరవనుండడంతో చిన్నారులు ఆటపాటలతో సందడి చేశారు.

గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వ కార్యాలయాలకు భోగి, సంక్రాంతి, కనుమ మూడు రోజులు సెలవు రావడం, కనుమ విందుకు అనువైన రోజులు కావడంతో మద్యం విక్రయాలు గతంలో ఎన్నడూ లేని విధంగా సాగాయి. అధికారుల గణాంకాల ప్రకారం జిల్లాలో రోజుకు రూ.3.50 కోట్ల మద్యం విక్రయాలు సాగుతుండగా, కనుమ రోజు ఆ అమ్మకం మూడు రెట్లు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అంటే కనుమ రోజున మద్యం ప్రియులు జిల్లాలో రూ.10 నుంచి 12 కోట్ల మద్యం వ్యాపారం సాగుతుందని అంచనా.

కనుమ రోజున పలురకాల కార్యక్రమాల్లో పాల్గొని ఆనందించారు. కొత్త సినిమాలను చూసేందుకు జనం ఎగబడ్డారు. హనుమాన్, గుంటూరు కారం, నా స్వామిరంగ, సలార్, వంటి పెద్ద సినిమాలతో పాటు సినిమాలకు జనం క్యూకట్టారు. దీంతో థియేటర్ల ప్రాంగణాలన్నీ జన సందోహంగా మారాయి. కొత్త సినిమా టిక్కెట్లు దొరకని వారు, పక్కనే ఉన్న మరో థియేటర్లలో ప్రదర్శిస్తున్న సినిమాలకు వెళ్లి కాలక్షేపం చేశారు. చిన్నారులు పార్కులకు వెళ్లి ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. పలువురు ఆలయాలను సందర్శించారు.

జన జాతర

కనుమ సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో జాతరలు నిర్వహించారు. జాతర్లకు పిల్లా పాపలు, కుటుంబసభ్యులతో కలిసి వెళ్లి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆమదాలవలస ప్రాంతంలోని సంగమేశ్వర ఆలయ ప్రాంతంలో నిర్వహించిన జాతరకు సమీప ప్రాంతాల నుంచి భారీగా జనం తరలివచ్చారు. శ్రీకాకుళం రూరల్ మండలం పెద్దపాడు అప్పనమ్మతల్లి దేవాలయం వద్ద నిర్వహించిన జాతరకు పెద్దఎత్తున పాల్గొన్నారు. పాతపట్నం మండలం నీలమణిదుర్గమ్మ దేవాలయం సందర్శనకు సందర్శకులు పోటెత్తారు. నరసన్నపేట మండలం జల్లువానిపేటలోని దానప్పతల్లి దేవాలయాలు కిటకిటలాడాయి. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాలతో పాటు ఒడిశా నుంచి భారీగా జనం తరలివచ్చారు.

కలసి ఉంటే కలదు సుఖం

సంక్రాంతి సందర్భంగా ఒక్కటైన ఆరు కుటుంబాలు

కొలువుదీరిన 'గొప్పిలి' కుటుంబం

ప్రజాశక్తి- టెక్కలి

మారుతున్న వ్యవస్థలో ఉమ్మడి కుటుంబాల బందాలు దూరమయి. వృష్టి కుటుంబాలు పెరుగుతున్నాయి. ఈ క్రమంలో ఉమ్మడి కుటుంబాల కలివిడితనం, సాంప్రదాయాలు, బంధుత్వాలు, బంధాలు, అనుభంధాలూ కనుమరుగవుతున్న ప్రస్తుత తరుణంలో టెక్కలికి చెందిన కుప్పిలి వారి కుటుంబం సాంప్రదాయాన్ని పాటిస్తూ... మ్మడి కుటుంబం గొప్పతనాన్ని సంక్రాంతి పండగ సందర్భంగా కలుసుకోవడం గమనార్హం. టెక్కలికి చెందిన కీర్తిశేషులు కుప్పిలి ఈశ్వరరావు, పద్మావతి దంపతులకు ఆరుగురు కుమారులు. వీరంతా వివిధ ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. వీరిలో ముగ్గురు టెక్కలిలోనే ఉన్నారు. మిగిలిన ముగ్గురు మాత్రం ఇతర ప్రాంతాల్లో ఉంటున్నారు. పండగ నేపథ్యంలో కుప్పిలి నగేష్ ఇంట్లో వీరంతా కలుసుకొని పండగ జరుపుకొని ముచ్చట్లు ఆడుకోవడం విశేషం. రమేష్ (ప్రిన్సిపాల్), సురేష్ (ప్రిన్సిపాల్), నగేష్ (ఉపాధ్యాయులు), గనేష్ (జెఇ), ప్రకాష్ (ఉపాధ్యాయులు)గా విధులు నిర్వర్తిస్తున్నారు. కుటుంబ సభ్యులు అందరూ తమ పిల్లలను కలుపుకుని 24 మంది సభ్యులతో ఇళ్లు కళకళలాడడం విశేషం.

నులివెచ్చని కిరణాలకు నిరీక్షణ

కోటబొమ్మాళి : చలికాలం చంపేస్తోంది.. ఉదయం వేళలో బారెడు పొద్దెక్కినా మంచు తెరలు తొలగక సూర్యకిరణాల కోసం నిరీక్షణ తప్పడం లేదు. మంగళవారం జాతీయ రహదారిపై పరిస్థితి కొంత ఆందోళనకరంగానే ఉంది. నిండా మంచు కురుస్తుండటంతో వాహనదారులు లైట్లు వేసుకుని నిదానంగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏ మాత్రం అశ్రద్ధ వహించినా ప్రమాదాలు జరిగే అవకాశా లున్నాయి. ఉదయం 9 గంటలైనా జాతీయ రహదారులు, గ్రామ రహదారుల్లో మంచుకురుస్తుండడంలో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మరో పక్క రబీలో వేసుకున్న అపరాలకు సైతం తీవ్రంగా దెబ్బతీస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ రహదారిపై కురుస్తున్న మంచు

నాడు రద్దీగా కనిపించిన నగర రోడ్లు

నాడు - నేడు

శ్రీకాకుళం అర్బన్ : సంక్రాంతి పర్వదినాలకు పదిహేను రోజుల ముందు నుంచి నగరంలోని వ్యాపార సంస్థలు, వ్యాపార కూడళ్లు రద్దీగా కనిపించారు. గడచిన నాలుగు రోజులుగా ప్రధాన రహదారుల్లోని వస్త్ర దుకాణాలు, మార్కెట్ కిక్కిరిసిపోవడంతో రాక పోకలు సాగించలేనంత రద్దీగా కనిపించాయి. కొత్త దుస్తుల కొనుగోలకు నగర వాసులతో పాటు పట్టణ పరిసర ప్రాంతాల నుంచి వచ్చే వారితో కిటకిటలాడాయి. వాహనాల పార్కింగ్‌కు నగరంలో అనువైన స్థలం లేకపోవడంతో ట్రాఫిక్‌నకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. దీంతో సెంటర్ పార్కింగ్ ఏర్పాటు చేసినా అక్కడా పార్కింగ్ స్థలానికి మించి వాహనాలు పెట్టడంతో నడిచి వెళ్లే వారు సైతం ఇబ్బందిపడ్డారు. ఇదంతా సంక్రాంతి రోజువరకు గడచిన పది రోజుల పాటు సాగింది. కనుమ రోజైన మంగళ వారం అందుకు భిన్నంగా కనిపించింది. నగరంలో జనం రద్దీ తగ్గింది. వస్త్ర దుకాణాలు ఖాళీగా కనిపించాయి. మార్కెట్ సైతం ఖాళీగా ఉండడంతో రోడ్లపై జనం కరవయ్యారు. దీంతో నగరంలోని ప్రధాన రోడ్లన్నీ బోసిపోయి కనిపించాయి. సాధారణ రోజుల్లో ఉండే రద్దీ కూడా లేకుండాపోయింది.

నేడు బోసిపోయిన జిటి రోడ్డు

పండగ పూట విషాదం

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

సంక్రాంతి పండగ పూట జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. దీంతో ఆయా గ్రామాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి. పలాసలో రెండు టూరిస్టు బస్సులు ఢీకొని ఒకరు, కొత్తూరు మండలం బలద వద్ద బైక్ బోల్తాపడి మరొకరు మృతి చెందారు.

ప్రజాశక్తి పలాస

రెండు టూరిస్టు బస్సులు సోమవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో ఢీకొనడంతో అందులో ప్రయాణిస్తున్న సహాయక డ్రైవర్ దినేష్ విషాద్ (26) మృతి చెందారు. మరో ఏడుగురికి యాత్రికులు చిన్నచిన్న గాయాలకు గురై ప్రాణాపాయం నుంచి తృటిలో తప్పించుకున్నారు. పూరి నుంచి అన్నవరం దైవదర్శనం కోసం వెళు ంగా.. ఈ సంఘటన జరగ్గా మృతుడు, క్షతగాత్రులంతా ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అనుపూర్ గ్రామానికి చెందినవారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రం పూరి యాత్ర ముగించుకొని జాతీయ రహదారిపై రెండు టూరిస్టు బస్సులు వెళ్తుంగా పలాస జాతీయ రహదారి నెమలినారాయణపురం వద్ద మొదటి టూరిస్టు బస్సు డ్రైవర్ బహిర్భూమికి వెళ్లడం కోసం రోడ్డు పక్కకు తిప్పాడు. వెనుక నుంచి వస్తున్న మరో టూరిస్టు బస్సు డ్రైవరు దీన్ని గుర్తించకపోవడంతో ఎదురుగా ఆపేందుకు ప్రయత్నిస్తున్న వాహనాన్ని బలంగా ఢీకొట్టాడు. ఈ సంఘటనలో తాత్కాలికంగా బస్సు డ్రైవరుగా వ్యవహరిస్తున్న మరో డ్రైవర్ దినేష్విషాద్ బస్సు క్యాబిన్లో చిక్కుకొని తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనతో పాటు మరో ఏడుగురు గాయపడడంతో వెంటనే స్థానికులు 108, హైవే అంబులెన్స్ సిబ్బంది వెంటనే పలాస ప్రభుత్వాస్పత్రికి క్షతగాత్రులను తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి దినేష్విషాద్ మృతి చెందారు. రెండు బస్సుల్లో మొత్తం 104 మంది యాత్రికులు ప్రయాణిస్తున్నారు. సంఘటన స్థలానికి కాశీబుగ్గ పోలీసులు చేరుకొని ప్రమాదం జరగడానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత ట్రావెల్ బస్సు యాజమాన్యం మరో బస్సును ఏర్పాటు చేసి యాత్రికులను సొంత ప్రాంతాలకు తరలించారు. పండగంటి పూట యాత్రికుల బస్సులకు ప్రమాదం జరగడంతో వారంతా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా యాత్రికులు పడుతున్న ఇబ్బందులు గుర్తించి స్థానిక సత్యసాయి మందిర నిర్వాహకులు మల్లా రామేశ్వరరావు, శరత్, శ్రీనివాస్‌తో కూడిన బృందం వారికి అల్పాహారం అందించి ఉదారత చాటారు. అదేవిధంగా గ్రీన్‌ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్ ఆధ్వర్యాన క్షతగాత్రులకు మధ్యాహ్నం భోజన ఏర్పాట్లు చేశారు. కాశీబుగ్గ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పలాస : దెబ్బతిన్న టూరిస్టు బస్సులు (ఇన్‌సెట్‌లో దినేష్విషాద్ మృతదేహం)

కొత్తూరు : మండలంలోని బలద వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సీతంపేట మండలం గోరపాడుకు చెందిన బిడ్డిక కమేశ్వరరావు (42) మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు... ద్విచక్రవాహనంపై రాణిపేట ఉంటున్న బంధువుల ఇంటికి అతివేగంగా వెళ్తున్నాడు. సడన్‌గా బ్రేక్ వేయడంతో బైక్ పైనుంచి జారిపడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు 108లో కొత్తూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్య పరీక్షించగా... అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న పోలీసులు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి గుర్రయ్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎం.ఎ.అహ్మద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు విశాఖపట్నంలో లారీ డ్రైవరుగా పనిచేస్తున్నారు. దీంతో గ్రామం శోకసంద్రంలో మునిగింది. మృతుడికి పెళ్లి కాలేదు. తల్లిదండ్రులు ఉన్నారు.

షర్మిల నియామకంపై హర్షం

ప్రజాశక్తి- టెక్కలి

ఏపి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా వైఎస్.షర్మిలను నియమించడం హర్షణీయమని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు ప్రకటనలో తెలిపారు. షర్మిల హయాంలో ఏపిలో కాంగ్రెస్ జెండా ఎగురుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణా ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం మాదిరిగానే ఆంధ్రాలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందన్నారు. ఆదే విధంగా గిడుగు రుద్రరాజును కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితునిగా ఎంపిక చేయడం హర్షణీయమన్నారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో కోత మధుసూదనరావు, పొట్నూరు ఆనందరావు ఉన్నారు.


శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు

పార్టీ కోసం కష్టపడిన వ్యక్తి శ్రీనివాస్

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

టిడిపి, కింజరాపు కుటుంబం కోసం నిరంతరం కష్టపడి తన సేవలను అందిస్తున్న వ్యక్తి లాడి శ్రీనివాస్ అని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి శాసన సభ్యులు కింజరాపు అచ్చెన్నాయుడు, శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. మంగళవారం నిమ్మాడలో టిడిపి పార్టీ కార్యాలయ ఇన్‌ఛార్జి లాడి శ్రీనివాస్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ పిఎసిఎస్ అధ్యక్షుడు హరివరప్రసాద్, ప్రభాకర్ పాల్గొన్నారు.

పండగ పూట 'అన్నా క్యాంటీన్'

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పండగ పూట హోటళ్లు నగరంలో సెలవు కావడంతో నగరానికి వచ్చి వెళ్లే వారితో పాటు ఆకలితో అలమటిస్తున్న నిరుపేదలకు అన్నం దొరకని పరిస్థితి. అయితే పండగ పూట పట్టెడు అన్నం పెట్టాలన్న ఆలోచనతో 272 రోజులుగా తాను నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్ ద్వారా జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు గొండు శంకర్ మూడుచోట్ల అన్న క్యాంటీన్‌లు నిర్వహించి ఉచితంగా భోజనం పెట్టారు. అన్నార్తుల కోసమే అన్నా క్యాంటీన్ ద్వారా సంక్రాంతి కనుమ పండగలోనూ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పిసా వెంకటరమణమూర్తి, టిఎన్‌ఎస్‌ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు రెడ్డి శంకర్, మోహన్, ఆనంద్, కిషోర్, ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

దీక్షలో పాల్గొన్న బెంతు ఒరియాలు

కొనసాగుతున్న దీక్షలు

ప్రజాశక్తి - కవిటి

కుల ధ్రువీకరణ పత్రాల కోసం బెంతు ఒరియాలు చేస్తున్న దీక్షలు 20వ రోజుకు చేరుకున్నాయి. అందులో భాగంగా మంగళవారం దీక్షలో బెంతు ఒరియా సంఘం జిల్లా కార్యదర్శి శివ బిసాయి, ఉపాధ్యక్షుడు మోహన్ సాహు, కుసుంపురం సర్పంచ్ ఊర్మిళ, ఎంపిటిసి కె.పద్మావతి, సత్యనారాయణ తదితరులు పాల్గొని తమ సంఘీభావం ప్రకటించారు.

ఘనంగా అప్పలసూర్యనారాయణ జన్మదినం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ జన్మదిన వేడుకలను మంగళవారం అరసవల్లిలోని ఆయన స్వగృహంలో నిరాడంబరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేకును కట్ చేశారు. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, నగర టిడిపి అధ్యక్షులు మాదారపు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి చిట్టి నాగభూషణం, ఉంగటి రమణ, పాపారావు, విభూది సూరిబాబు, జామి భీమశంకరరావు, కె.సుశీల, భాస్కరరావు, రాము పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుండ దంపతులకు టిడిపి నాయకులు దుశ్శాలువ కప్పి సన్మానించారు.

పంపిణీ చేసిన కుట్టు మిషన్లతో మహిళలు

కుట్టు శిక్షణతో ఆర్థికంగా ఎదగాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

మహిళలు ఆర్థికంగా చైతన్యవంతులుగా ఎదిగేలా కృషి చేయడమే న్యూ లైఫ్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ సంస్థ ముఖ్య ఉద్దేశమని ఆ సంస్థ డైరెక్టర్ కె.శ్యామ్ మార్కస్ అన్నారు. మంగళవారం పట్టణంలో 7వ వార్డు చింతాడ గ్రామంలో ఉన్న న్యూ లైఫ్ హౌస్ ఆఫ్ ప్రేయర్ చర్చ్ ప్రాంగణంలో కొనసాగుతున్న న్యూ లైఫ్ టైలరింగ్ శిక్షణ కేంద్రంలో మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుట్టు మిషన్ల శిక్షణను వినియోగించుకొని మహిళలు స్వయం సాధికారిత సాధించాలన్నారు. ఆరు నెలలు టైలరింగ్ శిక్షణ పొందిన ఎనిమిది బ్యాచ్ మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. అనంతరం న్యూ లైఫ్ టైలరింగ్ సెంటర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పాస్టర్ జి.కృపావరం మాట్లాడుతూ ఎంతోమంది మహిళలు ఈ సంస్థలో టైలరింగ్ శిక్షణ పొంది అనంతరం ఉపాధి పొందుతూ వారి కుటుంబాలకు ఆర్థికంగా నిలబడుతున్నారన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి మహిళ సద్వినియోగం చేసుకొని ఆర్థికం, సామాజికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

అరసవల్లిలో గోసేవ

శ్రీకాకుళం అర్బన్: సంక్రాంతి వేడుకల్లో భాగంగా మూడో రోజు మంగళవారం కనుమ పండగ సందర్భాన్ని పురస్కరించుకుని అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో గోసేవ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో గోసేవ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ సంప్రదాయ బద్ధంగా నిర్వహించిన ఈ సేవలో గోసేవ ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ వి.హరిసూర్యప్రకాష్, శాసపు జోగినాయుడు, సీనియర్ న్యాయవాది కర్రా రవి, పాలకొండ కోరుదుర్ ఆలయ ప్రధాన అర్చకులు ధారపూడి లక్ష్మీనారాయణశర్మ, బి.ఎస్.చక్రవర్తి పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ

నౌపడ: సంతబొమ్మాళి మండలం నౌపడ గ్రామంలో శ్రీ నాగమణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చెన్నూరు గౌరీ, బాబ్జి దంపతులు ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా ప్రతి ఏటా సుమారు 500 మంది పేదలకు రెండు కిలోల బియ్యం, పంచదార, బెల్లంతో పాటు దుస్తులు పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

ఘనంగా సంక్రాంతి సంబరాలు

బూర్జ : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనుబాబు

పోలాకి : మాట్లాడుతున్న సర్పంచ్ ప్రతినిధి వెంకట రమణ

ప్రజాశక్తి- నందిగాం

మండలంలో బడగాంలో సంక్రాంతి సంబరాలు శనివారం భోగి పండుగను పురస్కరించుకొని ఘనంగా ప్రారంభమయ్యాయి. అనంతరం సంక్రాంతి రోజంతా టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ చైర్, ముగ్గుల పోటీలతో పాటు వీధివేషాలతో గ్రామమంతా పండగ వాతావరణం కనపడింది. సర్పంచ్ కూన శాంతారావు, గ్రామ యువకుల ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. అనంతరం విజేతలకు నగదు బహుమతులు అందించారు.

బూర్జ: వ్యవసాయంతోనే మానవాళికి మనుగడ సాధ్యపడుతుందని పల్సస్ గ్రూప్ సిఇఒ గేదెల శ్రీనుబాబు అన్నారు. మండలం పెద్దపేట గ్రామంలో మాజీ జెడ్‌పిటిసి ఆనెపు రామకృష్ణనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో ఉద్యోగమే పురుష లక్షణం అనేది పూర్వపు సామెతని, ప్రస్తుతం వ్యవసాయ రంగంలోనే ప్రతిఒక్కరు దృష్టిసారించి రాణించాలని కోరారు. ఇప్పటికే 50 లక్షలమంది మేధావులు, ఉన్నత విద్యావంతులు, పట్టభద్రులు ఆంధ్రప్రదేశ్ నుంచి వలస వెళ్లిపోయారన్నారు. ఆ పరిస్థితి లేకుండా మన రాష్ట్రంలోనే ప్రతి నిరుద్యోగ యువత ఉద్యోగాలు పొందే విధంగా సన్నాహాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిసిసిబి అధ్యక్షుడు డోల జగన్మోహన్, తూర్పు కాపు సంక్షేమ సంఘం అధ్యక్షులు సురంగ మోహనరావు, సీనియర్ అడ్వకేట్ రాజశేఖర్, తూర్పుకాపు ఉద్యోగ సంఘాల నాయకుడు రమణ నాయుడు, ప్రెసిడెంట్ కవితయ్య, జిల్లా ప్లాస్కోప్ అధ్యక్షుడు శాసపు జోగినాయుడు, కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం చైర్మన్ రౌతు గోపి, స్థానిక నాయకులు హాజరయ్యారు. కార్యక్రమంలో పిల్లలు ప్రదర్శించిన కృత్యాలు, నాటకాలు, పలువురిని ఆకట్టుకున్నాయి.

పోలాకి: మండలం సంత లక్ష్మీపురం గ్రామంలో గత నాలుగేళ్లగా పల్లె పలకరిస్తోంది పేరిట సంక్రాంతి సంబరాలను సర్పంచ్ యారబాటి నీలవేణి రమణ ఆధ్వర్యంలో ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా భోగి, సంక్రాంతి రోజుల్లో పిల్లలకు, యువకులకు, మహిళలకు కబడ్డీ, ఉట్టికొట్టడం, వ్యాయామ బలప్రదర్శన, కోడి పందేలు, రంగవల్లులు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

ఇచ్ఛాపురం: పట్టణంలో బెల్లు పడా వద్ద ఉన్న శివానంద గిరిపై గత మూడు రోజులుగా జరుగుతున్న కనుమ ఉత్సవాల విజయవంతంగా ముగిసింది. ఈ నెల14 నుంచి ప్రారంభించిన ఉత్సవాలు మూడో రోజు మంగళవారం ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు కొండమీద ఉత్సవ ఏర్పాట్లు తిలకించేందుకు భారీగా ప్రజలు తరలివచ్చారు. గాలి పటాలు పోటీలకు చిన్నారులతో పాటు పెద్దలు ఉత్సాహంగా పాల్గొన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించిన వివిధ రకాల పోటీలో గెలుపొందిన విజేతలకు ముగింపు వేడుకలకు హాజరైన అతిథిలతో అందజేశారు. మంగళవారం రాత్రి నిర్వహించిన సంస్కృతికి కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి కమిటీ గట్టి చర్యలు తీసుకోవడంతో కనుమ ఉత్సవాల ప్రశాంతంగా ముగిసింది.

పొందూరు : కోడెబళ్ల పోటీలను ప్రారంభిస్తున్న జెడ్‌పిటిసి కాంతారావు

ఇచ్ఛాపురం : గాలి పటాలు పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

పొందూరు: మండలంలో పలు గ్రామాల్లో సంక్రాంతి సందర్భంగా ఏటా కనుమ రోజు నిర్వహించే కోడెబళ్ల జాతర ఎంతగానో అలరించింది. మండలంలో పొందూరు, రాపాక, లోలుగు కనిమెట్ట గ్రామాల్లో సాంప్రదాయ బద్ధంగా ఈ కోడెబళ్ల పందాలు నిర్వహిస్తుంటారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఆయా గ్రామాల పెద్దలు, యువకులు, మహిళలు, చిన్నారులు, పెద్దఎత్తున పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని ఊడికలపాడులో నిర్వహించిన కనుమ పండగలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు కుటుంబలతో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొండు లక్ష్మణరావు, సనపల కరుణ్‌కుమార్, హనుమంతు వెంకటరావు, మెండ తిరుపతిరావు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి- పొందూరు

విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు మండలం గోరింట గ్రామంలో అవినాష్ సావే ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ చైర్మన్, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ నాయుకులు కూన వెంకటరావు ముగ్గులు పోటీలు నిర్వహించారు. ఆటో ట్రికల్ మేనేజింగ్ డైరెక్టర్ చింతాడ సింహాచలం ఆర్థికసాయంతో ముగ్గుల పోటీలు విజేతలకు గోరింట సర్పంచ్ చింతాడ శ్రీలక్ష్మి, ఆటోట్రికల్ డైరెక్టర్ చింతాడ సింహాచలం, మాజీ సర్పంచ్, ఆముదాలవలస నియోజకవర్గ టిడిపి బిసిసెల్ అధ్యక్షులు చింతాడ కృష్ణ వాసుదేవరావు, గ్రేహౌండ్స్ డిఎస్‌పి బాడాన సోమయ్య, ట్రస్టు కార్యదర్శి దుంపల మృదుల, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ అమ్మన్నాయుడు చేతులు మీదుగా బహుమతులు అందజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవినాష్ ఫౌండేషన్ తరుపున కూన వెంకటరావు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. ఈ ముగ్గుల పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన కూన శ్రీలేఖకు రూ.2వేలు, రెండవ బహుమతి చింతాడ చంద్రకళకు రూ.1500లు, మూడవ బహుమతి కె. కళ్యాణికి రూ.1000 అందజేశారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న 36 మందికి ప్రోత్సాహక బహుమతులు అందజేసారు. ముగ్గుల పోటీలకు న్యాయ నిర్ణేతలుగా చింతాడ మంగమ్మ, బాడాన మౌనికలు వ్యవహరించారు.

పొందూరు : బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ శ్రీలక్ష్మి

వజ్రపుకొత్తూరు: సాంప్రదాయాలను యువత పాటించాలని ఉద్దానం అభ్యుదయ సేవాసమితి అధ్యక్షుడు తమాడ లక్ష్మణరావు అన్నారు. సంక్రాంతి సందర్భంగా సోమవారం రాత్రి ఉద్దానం అభ్యుదయ సేవాసమితి ఆధ్వర్యంలో కొమరల్తాడలో నిర్వహించిన ముగ్గులు పోటీల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సంక్రాంతి పండగా కుటుంబ సభ్యులు, స్నేహితులతో సరదాగా జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, బహుమతులతో పాటు పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షులు, సభ్యులు మండల మహేష్, మండల రాము, దండుపాటి పాపారావు, చింత మహేష్, కొంకి మోహిని పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

టెక్కలి రూరల్: స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.5 వేలుచ తృతీయ బహుమతి రూ.3 వేలు అందించారు. ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలకు వెయ్యి రూపాయలు, ఒక చీర పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గొండెలి సుజాత, వైస్ ఎంపిపిలు పేడాడ రమేష్, మన్నెల కిషోర్, ఎంపిటిసి పీత హేమలత, వారణాసి గోవిందరావు, రవికుమార్, హనుమంతు వెంకటేశ్వరరావు, వార్డు సభ్యులు కింతల తిరుమల కుమార్ పాల్గొన్నారు.

మెళియాపుట్టి: కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి- కొత్తూరు

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం గోవిందరావు అధ్యక్షతన సోమవారం 1950 సంత్సరం నుంచి 2024 సంత్సరం వరకు చదువుకున్న విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి అందరు సహకరించాలని కోరారు. అలాగే రానున్న కాలంలో 75 వసంతాల వేడుకలు ఘనంగా నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా వైసిపి జిల్లా కోశాధికారి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు మాట్లాడుతూ ఈ పాఠశాలకు ప్రహరీగోడకు నాడు నేడు పనులు మంజూరయ్యాయన్నారు. పాఠశాల ప్రథమ ప్రధానోపాధ్యాయులు ఎద్దు గోపాల్‌దాస్ నాయుడు మాట్లాడుతూ అంకిత భావంతో పనిచేస్తే చేపట్టిన పని విజయవంతం అవుతుందన్నారు. ఈ వేడుకలకు కమిటీలు వేసి పాఠశాలలో 75 సంత్సరాల సమాచారం తీసుకొని వేడుకల్లో పొందుపరచడం ముఖ్యమన్నారు. దీనికి అందరి సహకారం అవసరమన్నారు. సంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తాతబాబు, లోతుగెడ్డ భగవాన్‌నాయుడు, కోయిలపు సంజీవరావు, విద్యా కమిటీ చైర్మన్ వడమ శ్రీను పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మెళియాపుట్టి మండల పరిషత్ ఉన్నత పాఠశాల 2008-2009 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 2008-2009 విద్యా సంవత్సరంలో టెన్త్ చదువుకున్న పూర్వ విద్యార్థులు అపూర్వ కలయికను నిర్వహించి పాఠశాలలో వారి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పాఠశాల స్థాయి విద్యను అభ్యసించిన రోజులు ఎంతో విలువైన రోజులని ఈ సందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు తమ మనోభావాలను వ్యక్తపరిచారు. తమ సహ విద్యార్థులు ఎవరైనా అనారోగ్యంతో, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుంటే వారికి అందరూ కలిసికట్టుగా ఆర్థికసాయం అందిస్తామని, అలానే పాఠశాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు. 15 సంవత్సరాల తర్వాత స్నేహితులను కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో వేలూరి లోచన బాబు, గంగాడ ప్రదీప్ కుమార్, బండారు హరిప్రసాద్, పుండ్రు చంద్రశేఖర్, గాలి ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి- పొందూరు

మండలం రాపాక గ్రామంలో స్వామి వివేకానంద గ్రంథాలయం 7వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామపెద్దలు మాట్లాడుతూ గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు అనంతరం ఉద్యోగుల సంఖ్య ఏటా గణనీయంగా పెరుగుతోందన్నారు. దీంతో వీరిని ఆదర్శంగా తీసుకొని చదువుకునే వారి సంఖ్య కూడా పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 2023లో కొత్తగా ఉద్యోగాలు పొందిన వారితో పాటు, విద్యారంగంలో ప్రతిభను కనపర్చిన వారికి ప్రతిభ ప్రోత్సాహక అవార్డులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి కె.గిరిబాబు, వైస్ ఎంపిపి ప్రతినిధి వండాన వెంకటరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, గ్రామపెద్దలు పోతురాజు సూర్యారావు, బలగ శంకర్ భాస్కరరావు, వండాన అప్పన్న మాస్టర్, యలకల ఆదినారాయణ, వండాన సూరపునాయుడు, గ్రంథాలయ కమిటీ సభ్యులు యలకల శ్రీరామ్మూర్తి, కోట నాగరాజు, ముల్లు హరినాథ్, ఇజ్జాడ ఆనందరావు, జామాన అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఉద్యోగులను సత్కరిస్తున్న సేవా సంఘం ప్రతినిధులు

ఉద్యోగులకు సత్కారం

ప్రజాశక్తి- టెక్కలి

మండలంలో నర్సింగపల్లిలో వివిధ రకాల ఉద్యోగాల్లో స్థిరపడిన వారికి గ్రామస్తులు మంగళవారం సత్కరించారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని వివిధ ప్రాంతాల్లో ఉన్న వారందరు గ్రామానికి చేరుకోవడంతో తమ గ్రామానికి చెందిన వారిని సత్కరించుకోవడం గౌరవంగా భావిస్తు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామానికి చెందిన విశ్రాంత సైనికులు, విశ్రాంతి ఉద్యోగులతో పాటు ప్రస్తుతం వివిధ ఉద్యోగాల్లో స్థిరపడిన వారిని సత్కరించినట్లు తెలిపారు. నర్సింగపల్లి సేవా సంఘం తరుపున చేపట్టిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ రౌతు జయమోహన్, మాజీ సర్పంచ్‌లు పోలాకి షణ్ముఖరావు, శరణకుమారి, ట్రస్టు సభ్యులు ఎన్ని షణ్ముఖరావు, ఇప్పిలి గణపతిరావు, దారపు జోగారావు, రట్టి ఆదినారాయణ, పెదరట్టి మణి, ఇప్పిలి సీతారాం, ధర్మారావు, రామకృష్ణ పాల్గొన్నారు.

బెల్లుపడా కాలనీ వద్ద రద్దీగా ఉన్న మటన్ సెంటర్

మటన్ షాపుల రద్దీ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురంలో ఎక్కడ చూసినా మటన్, చికెన్ షాపులు వద్ద రద్దీ విపరీతంగా పెరిగిపోయింది. కనుమ పండుగ సందర్భంగా మంగళవారం ఉదయం నుంచి మటన్, చికెన్ సెంటర్ వద్ద ప్రజలు బారులు తీరారు. చికెన్ వ్యాపారస్తులు కనుమ పండుగను దృష్టిలో పెట్టుకొని చికెన్ ధరలు ఆమాంతం పెంచారు. నిన్న, మొన్నటి వరకు కిలో రెండు వందలు ఉండే చికెన్ కనుమ పండుగ సందర్భంగా రూ.240 పెంచి అమ్మకాలు జరిపారు. మరో వైపు కొంతమంది సొంతంగా మేకలు, గొర్రెలు కొనుగోలు చేసి వాటాలు సర్దుకున్నారు.

'కలమట'కు శుభాకాంక్షలు

ప్రజాశక్తి- కొత్తూరు

పాతపట్నం మాజీ ఎంఎల్ఎ కలమట వెంకటరమణమూర్తికి సోమవారం సంక్రాంతి పర్వదినం జన్మదినం కావడంతో మాతల తనక్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన టిడిపి కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, బంధువులు, జనసేన కార్యకర్తలు పెద్దసంఖ్యలో వెళ్లి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో అగతముడి అరుణ్‌కుమార్, తిమర జగదీష్, పొత్రకొండ మోహనరావు, సర్పంచ్‌లు నెల్లి అచ్చుతరావు, గార భాస్కరరావు ఉన్నారు.

మెళియాపుట్టి: మండలంలో పెద్ద లక్ష్మీపురం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. స్థానిక మాజీ సర్పంచ్ బూర్ల లలిత శ్రీనివాస్ ఆధ్వర్యంలో కలమట జన్మదిన వేడుకలు నిర్వహించి కేకును కట్ చేశారు. అలాగే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ పిఎస్-ఎస్ అధ్యక్షులు మడపాల సీతారాం, మాజీ సర్పంచ్ బూర్ల రామారావు, ఢిల్లీరావు, మడపాల బైరాగి, తిరుపతిరావు, శశిభూషణరావు, రుక్మందర్రావు, నూకరాజు, కృష్ణారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జట్కా బండికి ఉపాధి కరువు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

రాజుల కాలంలో ఉన్న రథాలు, గుర్రాలు, జమీందార్ల కాలం నాటి గూడుబళ్ళ, జట్కాబళ్ల అంతరించి నేడు కాలచక్రంలో కనుమరుగవుతున్నాయి. నేటి కాలంలో అత్యంత వేగంగా పయనించే బస్సులు, ఆటోలు, కార్లు ప్రధాన ప్రయాణ సాధనాలుగా మారాయి. అయినప్పటికీ కొన్నిచోట్ల గుర్రంతో నడిచే జట్కాబళ్ల ప్రయాణ సాధనాలుగా నేడు కనిపించడం విశేషం. ముఖ్యంగా కోటబొమ్మాళి మండలం తిలారు, నారాయణవలస, జలుమూరు మండలం, పెద్దదూగాం, చిన్న దూగాం గ్రామాలకు చెందిన కొన్ని కుటుంబాలు వేరే వృత్తి చేపట్టలేక బ్రతుకు జట్కా బండిగానే జీవనం సాగిస్తున్నారు. చల్లపేట జంక్షన్ నుంచి తిలారు రైల్వేస్టేషన్ వరకు నడిపే ఈ జట్కాబళ్లపై ఎక్కి ప్రయాణం చేయడమంటే ఇప్పటికీ కొంత మందికి సరదాగానే ఉంటుంది. కానీ జట్కా నడిపే యాజమానికే రోజంతా కష్టపడినా పూట గడవని పరిస్థితితో జీవిస్తున్నారు. వేలాది రూపాయిల వ్యయంతో గుర్రాన్ని కొని దానికి తర్ఫీదు ఇచ్చి, జట్కాబండి నడుపుతున్నామని, గుర్రానికి గ్రాసం కూడా వేయలేని దుస్థితిలో ఉన్నామని తెలిపారు. తరతరాల నుంచి సంక్రమించిన ఈ జట్కా బండి వృత్తిని వీడలేక, మరో వృత్తిపై నైపుణ్యం లేక బతుకుతున్నామని ఆవేదనను వ్యక్తం చేసారు. ఈ జట్కా బళ్ల వల్ల వాయు కాలుష్యం ఉండకుండా ప్రభుత్వాలు, పాలకులు తమను అభినందించాల్సింది పోయి తమను పట్టించుకోవడం లేదని వారు వాపోయారు. తమ దుస్థితిపై ప్రభుత్వం స్పందించి సంక్షేమ పథకాలు అమలు చేసి ఆర్థికంగా ఆదుకోవాలని వారు కోరుతున్నారు.


తిలారు నుంచి నడుపుతున్న జట్కా బండి

బాధితునికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఆర్థికసాయం అందజేస్తున్న ప్రదీప్

బెల్లుపడ కాలనీలో నివాసముంటున్న బచ్చల సింహాద్రి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని వార్డు కౌన్సిలర్ ప్రదీప్, సోదరుడు దిలీప్ ఆర్థికసాయం అందించి దాతృత్వం చాటుకున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన సింహాద్రికి వైద్యఖర్చుల నిమిత్తం రూ.5వేలు ఆర్థికసాయం అందించారు.

అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- బూర్జ

సంక్రాంతి పండగ సందర్భంగా మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ అశోక్‌బాబు సూచించారు. సంక్రాంతి సెలవులు కారణంగా దూర ప్రాంతాలకు వెళ్లే వారు తమ గృహాలకు పటిష్టమైన తాళాలు వేసుకోవాలన్నారు. అలాగే తమకు సమాచారం అందించాలని కోరారు. ముఖ్యంగా ఇతర రాష్ట్రాల నుంచి చోరీలకు పాల్పడే వ్యక్తులు సంచరిస్తున్నట్లు సమాచారం వచ్చిందని తెలిపారు. గ్రామాల్లో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులపైన నిఘా ఉంచాలని, అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తుల ఆచూకిని తక్షణమే తెలియజేయాలని కోరారు.

కుళాయిని ప్రారంభిస్తున్న సోమేశ్వరరావు

తాగునీటి పథకం ప్రారంభం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో బాణాపురం పంచాయతీ పరిధిలో ఎకువబగడలో ఏర్పాటైన తాగునీటి పథకం ప్రారంభమైంది. మంగళవారం ఈ పథకాన్ని గ్రామ నివాసి, పాలకొండ తహశీల్దార్ పెద్దింటి సోమేశ్వరరావు, స్థానిక సర్పంచ్ పెద్దింటి చందరరావు ప్రారంభించారు. పంచాయతీ నిధులతో గ్రామంలో వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేశారు. దీంతో తాగునీటి సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. కార్యక్రమంలో గ్రామపెద్దలు, వార్డు మెంబర్లు, గిరిజనులు పాల్గొన్నారు.

17, 18న జిపిడిపి శిక్షణా తరగతులు

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 17, 18 తేదీల్లో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ జి.ఉమాసుందరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో పనిచేస్తున్న మండలస్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయాల సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, వెలుగు, ఆశా వర్కర్లు, ఉపాధి సిబ్బంది హాజరుకావాలని కోరారు.

పోస్టల్ పథకాలపై అవగాహన కల్పిస్తున్న షణ్ముఖరావు

పథకాలపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి- బూర్జ

పోస్టాఫీస్ అమలు చేస్తున్న పథకాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని రాజాం పోస్ట్ ఆఫీస్ ఇన్‌స్పెక్టర్ బి.షణ్ముఖరావు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో పోస్టాఫీస్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. పోస్టాఫీస్‌లో ఎన్నో పథకాలు అమలవుతున్నాయన్నారు. అంతకు ముందు కార్యాలయ నిర్వహణ, స్టాంపుల విక్రయాలు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనతో పాటు అప్పన్న, నిఖిత, సిబ్బంది తదితరులు ఉన్నారు.

టిడిపిలో చేరిన పలువురు వైసిపి నాయకులు

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలో మాతల క్యాంపు కార్యాయంలో సోమవారం పాతపట్నం టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి సమక్షంలో పాతపట్నం మండలం పెద్ద లక్ష్మీపురం పంచాయతీ సర్పంచ్‌గా పోటీ చేసిన దేవల చంద్రరావు, అదినారాణతో సహా 5 కుంటుంబాలు, అలాగే కొత్తూరు మండలం నేరడి పంచాయతీ జోగిపాడు గ్రామం నుంచి సిహెచ్ సంతోష్, లోకేష్, తరుణ్, అప్పలస్వామి, లోకేష్, శంకరరావు, రాజేష్, లక్ష్మి నారాయణ, హరికృష్ణతో సహా 30 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరారు. వీరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

గోతులు కప్పండి మహాప్రభో..

ప్రజాశక్తి- బూర్జ

ప్రమాదకరంగా ఉన్న గోతులను కప్పించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు. మండలంలో కొల్లివలస గ్రామంలో కుళాయి పైపులైన్ కోసం రోడ్డుకి ఇరువైపులా మిషన్లను ఉపయోగించి పెద్దపెద్ద గోతులను తవ్వించారు. అయితే ఇంతవరకు సంబంధిత అధికారులు పైపులైన్లు ఏర్పాటు చేయడం, గోతులను పూర్తిస్థాయిలో పూడ్చడం వంటి పనులను చేపట్టలేదు. దీంతో పండగ పూట గ్రామంలో ప్రజలు వీటిని గమనించక గోతిలో పడుతున్న సందర్భాలు ఉన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తవ్విన గోతులను కప్పించేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఇంటి ముందు రాళ్లతో కప్పిన గోతులు